క్లుప్తంగా

సస్యరక్షణ తప్పనిసరి



గుళ్లపాడులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో మురళీకృష్ణ

రేగిడి: మొక్కజొన్న పంటలో అధిక దిగుబడులకు సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని ఏవో మురళీకృష్ణ సూచించారు. మండలంలోని ఉంగరాడ, గుళ్లపాడు, అంబఖండి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లు, పెసర, మినప, మొక్కజొన్న తదితర పంటల సాగుపై ఆయన రైతులకు అవగాహన కల్పించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కోసం రైతులంతా ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వియ్యపు చక్రపాణి, ఎంపీటీసీ పిల్లా గౌరునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం రేపు

రాజాం సిటీ: స్థానిక ఆదర్శనగర్ అర్బన్ పీహెచ్‌సీ ఆవరణలో ఈ నెల 23వ తేదీన ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నామని వైద్యాధికారి యు.కిరణ్‌కుమార్ ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. కంటి శుక్లాలు, ఇతర కంటి సమస్యలతో బాధపడుతున్న వారు ఒరిజినల్ ఆధార్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు తీసుకుని శిబిరానికి రావాలన్నారు. ఈ అవకాశాన్ని పట్టణవాసులతో పాటు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చురుగ్గా 'ఉపాధి' పనులు



తెర్లాంలో దాసరిబందకు సాగునీరు వెళ్లే కాలువలో జంగిల్ క్లియరెన్స్ చేస్తున్న వేతనదారులు

తెర్లాం: మండలంలోని పలు గ్రామాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు చాలా చురుగ్గా జరుగుతున్నాయి. పనుల్లో భాగంగా అన్ని గ్రామాల్లో సాగునీటి కాలువలు, ఫీడర్ చానళ్లలో జంగిల్ క్లియరెన్స్, పూడికతీత పనులను వేతనదారులతో చేయిస్తున్నారు. తెర్లాంలో దాసరిబందకు సాగునీరు వెళ్లే కాలువలో గత రెండు రోజులుగా జంగిల్ క్లియరెన్స్ పనులు చేస్తున్నారు. ఈ పనులను ఎంపీడీవో రేగి రాంబాబు, ఏపీవో సుశీల మంగళవారం తనిఖీ చేసి వేతనదారులకు, క్షేత్ర సహాయకులకు పలు సూచనలు చేశారు. మామిడి తోటల్లో కూడా ఫారంపాండ్‌ల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని తెలిపారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రేగిడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్యామలాకుమారి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎంపీపీ దార అప్పలనరసమ్మ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులంతా హాజరుకావాలని ఆమె కోరారు.

సీసీ రోడ్డు ప్రారంభం



శిలాఫలకం ఆవిష్కరించి, రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

మెంటాడ: మండలంలోని పెద్దమేడపల్లి గ్రామంలో రూ.16 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి గుమ్మడి సంధ్యారాణి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇప్పటికే పల్లె పండగ పనుల్లో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బోనెల ప్రకాశమ్మ, ఎంపీటీసీ రెడ్డి ఎర్రినాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు చలుమూరి వెంకటరావు, ఎంపీడీవో భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు ప్రారంభం

బొబ్బిలిరూరల్: మండలంలోని పారాది, దిబ్బగుడ్డివలస గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు మంగళవారం ప్రారంభించారు. ఆరేళ్ల వయసులోపు చిన్నారులందరికీ ఆధార్ నమోదు చేయించాలని ఎంపీడీవో పి.రవికుమార్ సూచించారు. సచివాలయాల్లో అందిస్తున్న ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దు

బొబ్బిలి: ఇళ్ల ముంగిట ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయవద్దని, ఎవరైనా చెత్త వేస్తే వారికి నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పట్టణంలోని మెయిన్‌రోడ్డు, పెద్దబజారు రోడ్డు, మంగలి వీధి, శ్వేతాచలపతి స్కూల్ రోడ్డు, తాండ్ర పాపారాయుడు బొమ్మ ప్రాంతాల్లో మంగళవారం ఆమె పర్యటించి, పారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని సూచించారు. కాలువల్లోని మురుగును ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు.

క్వార్టర్స్.. శిథిలం!

- శిథిలావస్థలో రాజాం ప్రభుత్వాస్పత్రి క్వార్టర్స్
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- అద్దె భవనాల్లో నివశిస్తున్న వైద్య సిబ్బంది
- క్వార్టర్స్ పునఃనిర్మించాలని విజ్ఞప్తి

రాజాం: మున్సిపాలిటీలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి వైద్య సిబ్బంది క్వార్టర్స్(నివాస భవన సముదాయాలు) శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో స్థానికంగా నివాసం ఉండి, 24 గంటల పాటు వైద్యసేవలందించేందుకు అందుబాటులో ఉండాల్సిన వైద్యులు, ఇతర సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ఇంకా క్వార్టర్స్‌ను బాగు చేసి వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అద్దె భవనాల్లోనే ఉండాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడి ఆస్పత్రి ఏరియా ఆస్పత్రిగా రూపుదిద్దుకుని దాదాపు 30 ఏళ్లు కావస్తోంది. 50 పడకల నుంచి 100 పడకల ఆస్పత్రిగా విస్తరించి, 24 మందికి పైగా వైద్యులు, 100 మంది వరకు సిబ్బంది ఆస్పత్రిలో సేవలందిస్తున్నారు. ఇప్పుడు వీరంతా శిథిల క్వార్టర్స్‌లో ఉండలేక అద్దె భవనాల్లో కాలం నెట్టుకొస్తున్నారు. ఇప్పటికైనా అద్దె భారం తగ్గేలా ఆస్పత్రి క్వార్టర్స్ భవనాలు పునఃనిర్మించాలని కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు చెప్పాం..



ఆస్పత్రి క్వార్టర్స్ ఎప్పుడో 30 ఏళ్ల క్రితం నిర్మించినవి. వాటిని వినియోగంలోకి తీసుకురావాలని ఉన్నతాధికారులకు చెప్పాం. వాటి స్థానంలో కొత్తవి నిర్మించాల్సి ఉంది. ఆస్పత్రి ఆవరణలో క్వార్టర్స్ లేక వైద్యులు వేరేచోట అద్దె భవనాల్లో ఉంటున్నారు. ఇక్కడి క్వార్టర్స్ వినియోగంలోకి తీసుకువస్తే సిబ్బందికి మేలు కలుగుతుంది. ఆ దిశగా ఆలోచన చేస్తున్నాం.

– డాక్టర్ కరణం హరిబాబు, సూపరింటెండెంట్, రాజాం ఏరియా ఆస్పత్రి

నిరుపయోగంగా భవనాలు..

గతంలో ఇక్కడ వైద్యులు, సిబ్బంది నివాసం ఉండేందుకు వీలుగా 20 గదులతో క్వార్టర్స్ భవనాలు ఉండేవి. ఇవన్నీ ఇప్పుడు శిథిలావస్థ దశకు చేరుకున్నాయి. కొన్ని భవనాలు తొలగించి, అదనపు ఆస్పత్రి భవనాలు నిర్మించారు. మిగిలిన క్వార్టర్స్ భవనాలను అలానే వదిలేశారు. ఇప్పుడు అలా వదిలేసిన భవనాల గోడలపై పగుళ్లు ఏర్పడడం, శ్లాబ్ పెచ్చులు ఊడిపోవడంతో అవి కూడా మూలకు చేరాయి. వైద్యులు, సిబ్బంది ఉండాల్సిన ఈ గదులు.. ప్రస్తుతం విషసర్పాలకు ఆవాసాలుగా మారాయి.



శిథిలావస్థలో రాజాం ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది క్వార్టర్స్ భవనాలు

కబ్జా దిశగా ఆస్పత్రి స్థలం..

రాజాం సామాజిక ఆస్పత్రి క్వార్టర్స్ భవనాలతో పాటు మైదాన ప్రాంతం కూడా విస్తరణకు నోచుకోలేదు. అధ్వానంగా తయారై, ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అనే చందాన ఆస్పత్రి ఆవరణ మొత్తం అస్తవ్యస్తంగా మారింది. వెనకభాగం ప్రహరీ లేకపోవడంతో ఆస్పత్రి స్థలం కబ్జాకు గురవుతోంది. ఆ ప్రాంతంలో పక్కా గదుల నిర్మాణం చేస్తున్నారు. ఆస్పత్రి ఆవరణలో పలువురు ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను పార్కింగ్ చేసుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఆస్పత్రి క్వార్టర్స్‌ను వినియోగంలోకి తీసుకురావాలని వైద్య సిబ్బంది కోరుతున్నారు.



అధ్వానంగా ఆస్పత్రి మైదానం

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని, ఆ దిశగా ఉపాధ్యాయులంతా కృషి చేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని చీకటిపేట ప్రాథమిక పాఠశాలను మంగళవారం సందర్శించిన ఆయన.. అక్కడి విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరు, పాఠశాల రికార్డులు, విద్యార్థుల చేతిరాత పుస్తకాలను పరిశీలించి, పలు సూచనలు చేశారు. చదువులో వెనకబడిన ప్రతీ విద్యార్థి విద్యాప్రగతికి చర్యలు తీసుకోవాలని, మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాలు విద్యార్థులకు వండిపెట్టాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఉండేలా చూడాలన్నారు. అంతకుముందు వివిధ ప్రశ్నల ద్వారా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అంచనా వేశారు.



విద్యార్థినితో పదాలు చదివిస్తున్న ఎంఈవో త్రినాధరావు

అనాథ ఆశ్రమాల నిర్వహణపై ఆరా

బొబ్బిలి: కలెక్టరు ఆదేశాల మేరకు స్థానిక పట్టణంలోని అనాథ ఆశ్రమాలు, బాలల సంరక్షణ కేంద్రాలను జిల్లా కమిటీ మంగళవారం సందర్శించింది. తొలుత హ్యాండ్ ఇన్ హ్యాండ్, సన్‌రైజ్ హోమ్, పాత బొబ్బిలిలోని బాలసదన్‌లకు కమిటీ సభ్యులు వెళ్లి, ఆయా సంస్థల రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. అలాగే ఆ సంస్థల రిజిస్ట్రేషన్ రెన్యువల్ అర్హతలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. పారదర్శక సేవలందించాలని, ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ముఖ్యంగా సంస్థల్లో ఆశ్రయం పొందుతున్న వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో కమిటీ కన్వీనర్ సత్యనారాయణ, కో–కన్వీనర్ బీహెచ్ లక్ష్మి, సభ్యులు జె. విజయలక్ష్మి, వై.నాగరాజు, బి.రామకోటి, కె.జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా కమిటీ సభ్యులు

ఫౌండేషన్ పాఠశాల ప్రతిపాదన విరమించుకోవాలి



ఎంఈవోకు వినతిపత్రం అందజేస్తున్న పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి, తదితరులు

రామభద్రపురం: ఫౌండేషన్ పాఠశాల ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకోవాలని, ప్రతీ పంచాయతీలో ఓ మోడల్ ప్రాథమిక పాఠశాల ఉండేలా చర్యలు తీసుకోవాలని పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె.విజయగౌరి డిమాండ్ చేశారు. ఇదే విషయమై ఆమె యూటీఎఫ్ నాయకులతో కలిసి స్థానిక ఎంఆర్సీ భవనం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఆమె మాట్లాడుతూ ఏకోపాధ్యాయలు కాకుండా పాఠశాలకు కనీసం ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు కొనసాగించాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలు ఉండేలా చూడాలని, ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి తగ్గించాలన్నారు.

అనంతరం ఎంఈవో తిరుమల ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రసన్నకుమార్, కేశవరావు, సుధాకరరావు, వెంకటరావు, త్రినాధరావు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండడంతో పాటు సెల్‌ఫోన్ వినియోగం ద్వారా కలిగే అనర్థాలపై కూడా అందరూ అవగాహన కలిగి ఉండాలని సీఐ కె.నారాయణరావు అన్నారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దిశ, లా అండ్ ఆర్డర్, సమాజంలో బాలికలకు సోషల్ మీడియా వల్ల జరుగుతున్న నష్టాలను ఆయన మంగళవారం వివరించారు. ఫోన్లకు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పొద్దన్నారు. గుర్తు తెలియని వ్యక్తులతో ఫోన్‌కాల్స్, వాట్సాప్, ఫేస్‌బుక్ చాటింగ్‌లకు దూరంగా ఉండాలని తెలిపారు. ఏదైనా ప్రమాదంలో చిక్కుకున్నట్లు అనిపిస్తే టోల్‌ఫ్రీ నంబర్ 100కు ఫోన్ చేయాలన్నారు.

రేషన్ పక్కదారి పడితే చర్యలు

బొబ్బిలిరూరల్: పేదలకు అందించే నిత్యావసర సరుకులు(రేషన్) పక్కదారి పడితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు ఎం.శ్రీను హెచ్చరించారు. మండలంలోని రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులతో ఆయన తన కార్యాలయంలో మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. ఈ నెలలో కందిపప్పు కొరత ఉన్నందున కొంత మందికి అందించలేకపోయామని, ఇదే అదునుగా మరెప్పుడైనా తక్కువ వచ్చాయని సరుకులు మళ్లిస్తే అటువంటి వారిపై నిఘా ఉంటుందన్నారు. అవసరమైన సరుకుల మేరకు మాత్రమే డీడీలు సమర్పించాలన్నారు. సమావేశంలో సీఎస్‌డీటీ రెడ్డి సాయికృష్ణ పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన సీపీఐ నాయకులు

బొబ్బిలి: డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జి.భవ్యారెడ్డిని సీపీఐ నాయకులు ఒమ్మి రమణ, మునకాల శ్రీనివాసరావు, దళిత హక్కుల పోరాట సమితి నాయకుడు గర్భాపు రమేష్‌లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు.

గానాల రామ్మూర్తి జయంతి

బొబ్బిలి: పట్టణంలోని తారకరామా కాలనీ సమీపంలోని ఆలయంలో బ్రహ్మశ్రీ గానాల రామ్మూర్తి 134వ జయంతి మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐ కె.సతీష్‌కుమార్.. విశ్వబ్రాహ్మణుల ఉన్నతికి రామ్మూర్తి చేసిన సేవలను కొనియాడారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన

రాజాం: క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహనలో భాగంగా మండలంలోని పెనుబాక ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులతో క్షయవ్యాధిని అరికడదామని పిలుపునిస్తూ వైద్యసిబ్బంది మంగళవారం ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం క్షయవ్యాధి నివారణ విభాగం డివిజనల్ సూపర్‌వైజర్ లలిత.. వ్యాధి లక్షణాలు దాని బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సబ్జెక్టు టీచర్లను నియమించాలి



తమ న్యాయమైన డిమాండ్ల సాధనే లక్ష్యంగా యూటీఎఫ్(యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్) నాయకులు.. బొబ్బిలి ఎంఈవో కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా చేశారు. ఫౌండేషన్ పాఠశాలల ఆలోచన విరమించుకోవాలని, ప్రతీ పంచాయతీలో ఓ ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఏర్పాటు చేయాలని, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలని, ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలు రెండూ కొనసాగించాలన్నారు. అలాగే పాఠశాలల్లో ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి తగ్గించాలని, మోడల్ ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రాథమిక పాఠశాలల్లోనే 1 నుంచి 5 తరగతులను కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఎంఈవోలు లక్ష్మణరావు, వాసులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మహేశ్వరరావు, బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి రూరల్

అమరావతిని ఫ్రీజోన్‌గా ప్రకటించాలి



శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో ఫిబ్రవరి 6 నుంచి నాలుగు రోజుల పాటు జరగనున్న ఏఐవైఎఫ్(ఆలిండియా యూత్ ఫెడరేషన్) రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న కోరారు. బొబ్బిలిలోని గంటి ప్రసాదం స్మారక భవనం వద్ద సభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలోని నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. తక్షణమే జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వాలన్నారు. అలాగే అమరావతిని రాష్ట్ర రాజధాని చేస్తే దానిని ఫ్రీజోన్‌గా ప్రకటించి, అక్కడ భర్తీ చేసే ఉద్యోగాల్లో అన్ని జిల్లాల వారీగా సమానావకాశాలు కల్పించాలన్నారు. గతంలో హైదరాబాద్‌ను ఫ్రీజోన్ చేయడంతో అక్కడ అందరికీ ఉద్యోగావకాశాలు వచ్చాయని గుర్తు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు బి.సాయికిరణ్, బి.తులసి తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలి

పన్నులు వసూలు చేయండి

పన్నులు వసూళ్లను వేగవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశించారు. ఇదే విషయమై ఆమె బొబ్బిలి మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో మంగళవారం సమావేశమై, పలు సూచనలు చేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఇంటి పన్నులతో పాటు కుళాయి నీటి పన్నుల బకాయిలు పేరుకుపోయాయని, వాటిని ఇంటింటికీ వెళ్లి, వసూలు చేసుకురావాలన్నారు. కుళాయి పన్ను ఎక్కువగా ఉన్న వారి కుళాయి కనక్షన్ తొలగించాలని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9.30 గంటలకు కార్యాలయానికి వచ్చి, పన్నుల వసూళ్లకు వెళ్లాలన్నారు. – బొబ్బిలి



మూగజీవాలకు మెరుగైన వైద్యం



వంగర: రుషింగిలో పశువైద్య శిబిరానికి తీసుకువచ్చిన మూగజీవాలు



రేగిడి: సరసనాపల్లిలో పశువైద్య శిబిరంలో సిబ్బంది సేవలు

తెర్లాం/బాడంగి/రేగిడి/వంగర/రాజాం: మూగజీవాలకు మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా అన్ని మండలాల్లోని గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం పలు గ్రామాల్లో చేపట్టిన వైద్య శిబిరాల్లో పశువులు సహా గొర్రెలు, మేకలు, కోళ్లకు పశువైద్య సిబ్బంది ఆరోగ్య తనిఖీలు చేసి, అవసరమైన వాటికి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే వ్యాధుల బారినపడకుండా వాటికి ముందస్తు టీకాలు వేశారు. ఏదైనా వ్యాధి లక్షణాలతో మూగజీవాలు బాధపడితే వైద్యులను సంప్రదించి, సలహాలు, సూచనలు పొందాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.



బాడంగి: ముగడలో పాడిరైతులకు మందులు అందజేస్తున్న దృశ్యం



రాజాం సిటీ: మారేడుబాకలో నిర్వహించిన పశువైద్య శిబిరం



తెర్లాం: జగన్నాధవలసలో ఆవు చూడి తనిఖీ చేస్తున్న పశు వైద్యాధికారి నరేంద్రకుమార్

తెలుగు, ఇంగ్లిష్ మీడియంలు కొనసాగించాలి

సంతకవిటి: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో తెలుగు, ఇంగ్లిష్ మీడియంలు రెండూ కొనసాగించాలని మండల యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఉపాధ్యాయులు మంగళవారం ధర్నా చేపట్టారు. ఫౌండేషన్ పాఠశాల ప్రతిపాదనను విరమించుకోవాలని, అన్ని ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ అధ్యక్షుడు బూరాడ శ్రీనివాసం, కార్యదర్శి డోల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



సంతకవిటి: ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ప్రాథమికోన్నత పాఠశాలలకు మంగళం!

బాడంగి: భవిష్యత్‌లో ప్రాథమికోన్నత పాఠశాలలకు మంగళం పాడకతప్పదని విశ్వసనీయ సమాచారం. గత ప్రభుత్వ హయాంలో బాడంగి మండలంలో ఏడు ప్రాథమికోన్నత పాఠశాలలు ఉండగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం వాటిని రద్దు చేసే దిశగా ఆలోచన చేస్తోంది. 6, 7, 8 తరగతుల్లో 60 మంది పైబడి విద్యార్థులుంటేనే పాఠశాల ఉంటుందని, లేకపోతే రద్దవుతుందనేది అధికారిక సమాచారం. ఇదే విషయాన్ని ఎంఈవో లక్ష్మణరావు వద్ద 'సాక్షి' ప్రస్తావించగా ఏడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో రెండు ఉండొచ్చని, మిగతావి రద్దయ్యే అవకాశం ఉందని ఆయన తెలిపారు.

పాఠశాలల విలీనానికి సన్నాహాలు..

రాజాం: మండలంలోని రాజయ్యపేటలో ఉన్న రెండు ప్రభుత్వ పాఠశాలలను కలిపేందుకు(విలీనానికి) అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఎంఈవో ప్రవీణ్‌కుమార్‌తో పాటు స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ నాగయ్యలు మంగళవారం ఆ గ్రామానికి వెళ్లి, పరిశీలించారు. తల్లిదండ్రుల వద్ద విలీనంపై వివరాలు సేకరించారు. రెండు పాఠశాలలూ ఒకదానికొకటి దూరంగా ఉన్నాయని, కాలనీలో ఓ పాఠశాల, గ్రామంలో మరో పాఠశాల నడుస్తోందని, వాటిని కలపవద్దని గ్రామస్తులు సదరు వ్యక్తులకు విజ్ఞప్తి చేశారు.